టీడీపీలో అసంతృప్తి జ్వాల



- నేతల మధ్య కాక పుట్టిస్తున్న లోకల్ వార్
- జెండా మోసిన వారికి పార్టీలో ప్రాధాన్యత కరువు
- స్థానికేతరులకు టికెట్లు కట్టబెట్టడంపై రచ్చకెక్కిన విభేదాలు
- రాజీనామా యోచనలో కొందరు సీనియర్లు
- ఉనికి చాటుకునేందుకు తంటాలు పడుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకుపోతున్న 'వైఎస్సార్‌సీపీ'

రాయదుర్గం: సాధారణ ఎన్నికలు దగ్గరపడేకొద్దీ టీడీపీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. తెరపైకి అంతా బాగున్నట్టు నటిస్తున్నా.. నేతల మధ్య విభేదాలు మాత్రం తారస్థాయికి చేరుతున్నాయి. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించకుండా, స్థానికేతరులకు పెద్దపీట వేశారనే ఆక్రోశంతో.. ఆపార్టీ నేతల్ని రగిల్చివేస్తోంది. ఈ నేపథ్యంలో టికెట్టు ఆశించి బంగపడిన నేతలు.. కొందరు సీనియర్లు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థులుగా బరిలో దింపే కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్ర ఇద్దరు అనంతపురం నుంచి వలస వచ్చారనే అభిప్రాయం పార్టీలోని మెజార్టీ సభ్యుల్లో వినిపిస్తోంది. స్థానికంగా రెండుచోట్ల బలమైన అభ్యర్థులున్నా.. అవకాశం కల్పించలేదనే ఆవేదన ఉంది. దీంతో పార్టీ కార్యక్రమాలకు చాలా మంది దూరంగా ఉంటున్నారనే చర్చ సాగుతోంది. అలాగే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ది ఉరవకొండ సొంత ప్రాంతమైనా.. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన వెంటనే విజయవాడ, హైదరాబాద్ లాంటి మహా నగరాలకే పరిమితమవుతాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గంలో ఉమ, ఉన్నం వర్గాలు అమిలినేని గెలుపునకు సహకరించడం నల్లేరుపై నడకలాంటిదేనంటూ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాయదుర్గంలోనూ ఇద్దరు ముఖ్య నేతలు టికెట్ కోసం చివరిదాకా ప్రయత్నించి, బంగపడ్డారు. చినబాబును నమ్ముకుంటే.. ఆశలు కాస్త వమ్ము అయ్యాయి. దీంతో వారు, వారి క్యాడర్ మొత్తం పార్టీకి దూరమయ్యారు. మా ఓటు మాత్రమే వేసి రాజకీయాలు చేయకుండా ఇంట్లో ఉంటామంటూ టీ కొట్ల వద్ద బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

అమిలినేని ఆటవిడుపు..?

ప్రముఖ కాంట్రాక్టర్‌గా చెప్పుకునే అమిలినేని వర్గం కళ్యాణదుర్గంలో ఆటవిడుపు చర్యలకు దిగిందనే ఆరోపణలు అధికార పార్టీ నుంచి వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గంలో ఇటీవల ర్యాలీ పేరుతో టీడీపీ నేతలు నానా హంగామా చేశారు. మద్యం, బిర్యానీ ప్యాకెట్లు విచ్చలవిడిగా అందించారు. ర్యాలీలో ఎటుచూసినా తమ్ముళ్లు తూలుతూ, వాలుతూ కనిపించారు. ప్రయాణికులను ఇబ్బందులు కలిగించారు.

ప్రచారంలో దూసుకుపోతున్న 'ఫ్యాన్'

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రచారంలో 'ఫ్యాన్' దూసుకుపోతోంది. మేనిఫెస్టోను వెంట తీసుకెళ్లి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇవీ.. వాటిలో నెరవేర్చిన హామీలు ఎన్నో మీరే టిక్ వేయాలని ప్రజాశీస్సులు పొందుతున్నారు. చెప్పినవి, చెప్పనవి కూడా ప్రజల చెంతకే చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని నాయకులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. వలసపక్షులైన టీడీపీ నాయకులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని ఓటర్లకు కోరుతున్నారు. 2014లో టీడీపీకి అధికారం ఇస్తే ఏమి చేయలేక, చేతులెత్తేశారని, ఈసారి మళ్లీ గెలిపిస్తే ఇంటికో కారిస్తాం.? బంగారు గాజులు కొనిస్తాం..? ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తాం..? ఇలా సూపర్‌సిక్స్ పేరుతో దగా చేయడం ఖాయమని ప్రజలకు చెప్పారు. ప్రజలకు అమసమయ్యే పథకాలన్నీ జగనన్న ఇచ్చేశారని, చంద్రబాబుతో పనేమీలేదంటూ ప్రచారంలో చెప్తున్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ తలారి రంగయ్య



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ సారథి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ రంగయ్య కోరారు. శనివారం బోరంపల్లిలో రూ.43 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, వైఎస్సార్ రైతు భరోసా, ఈస్ట్ కోడిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. బోరంపల్లిలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. చాపిరి, హులికల్లు, విట్లంపల్లి, మల్లికార్జునపల్లి, ఉపాంక, యర్రంపల్లి, గరుడాపురం, కామక్కపల్లి, బోయలపల్లి, దాసంపల్లి, నారాయణపురం, గాజులపల్లి, పాలవాయి, తిమ్మగానిపల్లి, మల్లాపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, జెడ్పీటీసీ బొమ్మన్న, ఎంపీపీ మారతమ్మ, వైస్ ఎంపీపీ హనుమంతు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తిమ్మరాజమ్మ, పట్టణ కన్వీనర్, శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తం, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అంజనేయులు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, కౌన్సిలర్ సురేష్, కురవ సంఘం అధ్యక్షులు దొణస్వామి, రాష్ట్ర విద్యార్థి విభాగ కార్యదర్శి షేక్షా, బోరంపల్లి సర్పంచ్ శోభరాణి, ఎంపీటీసీ తిప్పమ్మ, బోరంపల్లి వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు గోళ్ల సూరి, అనిల్, బలరాం, బిక్కిహరి, గోళ్ల మోహన్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కళ్యాణదుర్గం: మండలం మల్లికార్జునపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎంపీ తలారి రంగయ్య సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. జీటీ తిమ్మప్ప, అనీల్‌కుమార్, తిప్పేస్వామి, జీటీ వెంకటేష్, జి.మచ్చన్నకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి, ఆహ్వానించారు. స్థానిక నాయకులు బూదెప్ప, రామచంద్ర, చిత్తయ్య, సురేష్, మద్దగిరి, దొణతిమ్మప్ప పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పాలవాయికి చెందిన టీడీపీ నాయకులు బోయ చెట్ల దుర్గన్న, బోయ రా మ్మూర్తి ఎంపీ రంగయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేశారు.

నేడు ఎంపీ పర్యటన

కంబదూరు: మండలంలో ఎంపీ తలారి రంగయ్య ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కర్తనపర్తి, కొత్తూరు, డీ.చెన్నేపల్లి, రాళ్లఅనంతపురం, రాళ్లపల్లి, మేలకుంట, మధ్యాహ్నం కొత్త ఐపార్సుపల్లి, పాత ఐపార్సుపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఉంటుందన్నారు.

వారిది ధన బలం.. మాది జన బలం

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలమంతా జనమేనని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ లక్షలాది రూపాయల సంక్షేమం అందించామన్నారు. ప్రజలను డబ్బుతో కొనవచ్చనే ఉద్దేశంతో చంద్రబాబు ధనవంతులకు టికెట్లు ఇస్తున్నారని విమర్శించారు. కానీ ఎంతటి ధనవంతులైనా ప్రజలే ఓట్లు వేయాలని గుర్తు చేశారు. సమన్వయకర్తగా తనను పార్టీ అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి ఇప్పటికి 60 రోజులైందని, ఈ కొన్నాళ్లలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.300 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు నుంచి పావగడ రైల్వే లైన్ ఏర్పాటు కోసం రూ.250 కోట్ల మంజూరు, బ్రహ్మసముద్రం మండలంలో కన్నేపల్లి, బుడిమేపల్లి గ్రామాల మధ్య రూ.43 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, ప్రతి గ్రామంలో తాగునీటి బోర్ల తవ్వకం, వీధి లైట్ల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు చేయించానన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



వజ్రకరూరు మండలం పందికుంటలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ తదితరులు



పందికుంటలో పార్టీలోకి చేరిన టీడీపీ నాయకులు

వజ్రకరూరు: ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ కోరారు. శనివారం మండలంలోని పందికుంటలో 'ఇంటింటికీ మన విశ్వన్న' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ, హరీష్‌కుమార్ యాదవ్ తదితరులు గడపగడపకూ వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవాలని కోరారు.

ప్రజలందరూ జగన్ వైపు నిలవండి..

పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజలు జగన్ వైపు నిలవాలని విశ్వ, హరీష్‌కుమార్ యాదవ్ కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పాలన అందించారన్నారు. టీడీపీ హయాంలో సిఫార్సులు ఉంటేనే పథకాలు అందేవని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిండుమనసుతో జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు ఉమామహేశ్వరి, ఎంపీపీ రమావత్‌దేవి, ఎఎంసీ చైర్మన్ అమర్‌నాథ్, పార్టీ మం డల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతువిభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, నాయకులు మీసాలసుంకన్న, చిన్నాయుడు, రత్నశేఖర్, హి మవంత్‌రాజు, వెంకట్రామిరెడ్డి, వడ్డెసుంకన్న, ఓబిరెడ్డి, ప్రభాకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామంలో శనివారం పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జుటూరు చెన్నయ్య, సువర్ణమ్మ, అంపమ్మతోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ: పట్టణంలోని 8వ వార్డులోని భజన మందిరం వద్ద రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శనివారం భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం, పార్టీ నాయకులు బసవరాజు, చందా చంద్రమ్మ, ఓబన్న, ఆసీఫ్, కురుబ ప్రకాష్, చిన్నభీమా, వన్నూర్‌సాబ్, సాధుకుళ్లాయిస్వామి, చెంగలమహేష్, వేమన్న, వడ్డె ఆంజినేయులు, వడ్డే మోహన్, జోగి హనుమంతు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి పరితపించిన నేత జగన్

ఉరవకొండ: పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కొడిగి గోవిందు పిలుపునిచ్చారు. శనివారం చిన్నమూస్టురు గ్రామంలో కురుబ సంఘం నేతల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కురుబ సంఘం నాయకులు ప్రకాష్, గాదిలింగ, చిన్న భీమా, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను స్వాగతించండి

- నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న సంక్షేమ పాలనను మరోమారు స్వాగతించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 28,29,30 వార్డుల్లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, పార్టీ శ్రేణులు, కౌన్సిలర్లతో కలిసి మెట్టు గోవిందరెడ్డి విస్తృతంగా పర్యటించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. నవరత్నాలు పథకాలతో లబ్ధి పొందని కుటుంబమే లేదని, పేదలు, మహిళలు ఆర్థికంగా బలోపేతమై ప్రతి ఒక్కరి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎంగా చేసి సంక్షేమ రుణాన్ని తీర్చుకోవాలన్నారు.

నయవంచకుడు చంద్రబాబు..

2014 ఎన్నికల్లో చంద్రబాబు మాయ మాటలు నమ్మి ఓటేస్తే కనీసం పది శాతం కూడా హామీలు అమలు చేయక 650 హామీల మేనిఫెస్టోను మాయం చేసిన ఘన చరిత్ర టీడీపీదని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు ఒంటరిగా పోటీ చేసే సత్తాలేక, దత్తపుత్రుడితో జత కట్టి అమలుకు సాధ్యం కాని సూపర్ సిక్స్ పథకాలంటూ గారడీ మొదలు పెట్టినట్లు విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబు..మరోసారి గట్టిగా బుద్ధి చెప్పి రాజకీయాల నుంచి శాశ్వతంగా పారదోలాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు వలిబాషా, శ్రీనివాసయాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చుంచుల నాగప్ప, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మేకల శ్రీనివాసులు మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, గోరంట్ల ఉష, ఐనాపురం మంజునాథ, ఫకృద్దీన్, పైతోట సంజీవప్ప, కొంతందేవరాజు, బండి అజయ్, నజీర్, శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్‌లు నిజాముద్దీన్, గౌని శ్రీరామిరెడ్డి, బషీర్ అహ్మద్, కృష్ణమూర్తి, పైతోట రఘు, వైజాగ్ రవి, గంగాధర్ పాల్గొన్నారు.

శారదమ్మకు ఘన నివాళి

కణేకల్లు: రైతు సంఘం మండల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి భార్య శారదమ్మ (58) అనారోగ్యంతో మృతి చెందింది. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పైనేటి తిమ్మప్పచౌదరి, వై.భీమిరెడ్డి, టీ.కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోకుర్తి జయరామిరెడ్డి, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, పాటిల్ బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణరెడ్డి శారదమ్మ భౌతికాయానికి నివాళులర్పించారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



పాదయాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు భారీ మెజార్టీతో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి అభిమాన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హనుమాన్ మాల ధారణలో పాదయాత్ర చేపట్టాడు. ఈపాదయాత్రను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సతీమణి వై.భువనేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.లక్ష్మీ నృసింహస్వామికి ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ సతీమణి 108 కొబ్బరికాయలు కొట్టి, స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఐదురోజుల మేర కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్రసాగుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేంత వరకూ హనుమాన్ దీక్షలోనే ఉంటానని తెలిపాడు. తాను 2004 నుంచి విశ్వేశ్వరరెడ్డి వెంట నడుస్తున్నట్లు తెలిపాడు. తనచేతికి జై జగన్ – 2011 అని పచ్చబొట్టు వేయించుకున్నట్లు తెలిపాడు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాథ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్/ వజ్రకరూరు: ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాయదుర్గం ప్రిన్సిపాల్ తోటా వెంకటేశు లు, వజ్రకరూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలా దేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలి పారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

నేడు వాహనాల వేలం

కంబదూరు: స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన 13 ద్విచక్ర వాహనాలకు ఈనెల 4న వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ తక్కి బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు అరబిక్ కళాశాల వార్షికోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని జామియా మహమ్మదీయ అరబిక్ కళాశాల 98వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ సయ్యద్ అమీర్ హమ్జ అబ్బాస్ తెలిపారు. మహరాష్ట్ర నుంచి ఉబేదుర్ రెహమాన్, విశాఖపట్నం నుంచి అబ్దుల్ సలామ్, తమిళనాడు నుంచి అబ్దుల్ అజీమ్ హాజరవుతున్నట్లు చెప్పారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

బెళుగుప్ప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల వార్షిక అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ సుబ్బరాజు గ్రామ పంచాయతీ సెక్రటరీలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రదానంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశులు, రవికుమార్, శ్రీరాములు, గోపాల్, రమణ, శంకర్, ఉమా శంకర్, జగదీష్, ఉమాదేవి, మమత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కంబదూరు: మండలంలోని అండేపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. గ్రామ మహిళలు వీధుల గుండా ర్యాలీ చేశారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలో అమ్మనాన్నకు...ప్రేమతో అనే అనాథ వృద్ధాశ్రమం ఆర్‌జేఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ సురేష్, పాస్టర్ జగదీష్‌ల ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు షీలా, రేఖ అనే సామాజిక సేవాకర్తలు శనివారం ప్రారంభించారు.

అనంతపురం వెళ్లి పింఛన్ అందజేత

వజ్రకరూరు: వెంకటాంపల్లిపెద్ద తండాకు చెందిన గావడి గోపాల్‌నాయక్ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ లక్ష్మీబాయి అక్కడికెళ్లి శనివారం పింఛన్ అందజేసింది.

కూడేరు: కడదరకుంటకు చెందిన ఓబుళపతి అనే వృద్ధుడు అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వలంటీర్ కృష్ణమూర్తి అక్కడికెళ్లి శనివారం పింఛన్ అందించాడు.

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన భీమన్నశెట్టి కర్ణాటక రాష్ట్రం బళ్లారి విమ్స్‌లో చికిత్సపొందుతున్నాడు. వలంటీర్ పూజ అక్కడికెళ్లి పింఛన్‌దారుడు భీమన్నశెట్టికి రూ.3 వేల పింఛన్ నగదు శనివారం అందజేసింది.

ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయం

బొమ్మనహాళ్: గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు అన్నారు. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో కొద్ది రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కారం అయ్యింది. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో తాగునీటి బోరును నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, ఆనంద్ రెడ్డి, వైస్ సర్పంచ్ నాగరాజు, జలేందర్, చిన్న బుజ్జి, అడవి రాముడు, బండూరు వన్నూరుస్వామి, పాల్గొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

వజ్రకరూరు: మండలంలోని పీసీ కొత్తకోటలో నాగవల్లి పద్మావతి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి శనివారం లాక్కెళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ద్విచక్రవాహనం ఎవరిదో?

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డు చికెన్‌మార్కెట్ సమీపంలోని మసీదు ఎదురుగా రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం 20 రోజు లుగా అక్కడే ఉంది. ఏపీ 02 క్యూ అనే నంబర్ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లారు. స్థానికులు దానికి తాళం వేసి, అక్కడే మరోచోట పార్క్ చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



బచ్చేహళ్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శెట్టూరు: వైఎస్సార్‌సీపీని గెలిపించుకొని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, కన్వీనర్ శివన్న యాదవ్ అన్నారు. శనివారం ఐదుకల్లు, యాటకల్లు, చిన్నంపల్లి, బచ్చేహళ్లి, చెర్లోపల్లి, ములకలేడు, అనుంపల్లి, తిప్పనపల్లి, పెరుగుపాళ్యం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీఎస్ కన్వీనర్ తిమ్మరాజు, నాయకులు పోస్ట్ రామకృష్ణ, హరినాథ రెడ్డి, తిప్పేస్వామి, ముత్యాలు, సోమశేఖర్, సర్పంచ్‌లు విరుపాక్షి, పాలయ్య, గంగన్న, నాగరాజు, ఎంపీటీసీలు బిటీ ప్రకాష్, నరసింహులు, నగేష్, నాయకులు మల్లిఖార్జున, మున్నూర్, నాగభూషణం, శ్రీన, ప్రతాప్, హనుమంతురాయుడు. సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

కుందుర్పి: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి జగనన్నకు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రం రెండింతలు అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి తదితరుల ఆధ్వర్యంలో ఎనుములదొడ్డి, రుద్రంపల్లి, మల్లాపురం, గురు వేపల్లి, బోదపల్లి తదితర గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ నాగరాజు, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఈరాము, సర్పంచులు విజయ్, గంగాధర, హనుమంతరాయుడు, బొమ్మయ్య నాయకులు బొమ్మలింగ, తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రాజగోపాల్, లక్ష్మణమూర్తి, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని 14,15 వార్డులలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పార్టీ పరిశీలకులు కందిగోపుల మురళి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, నాయకులు నరేంద్ర రెడ్డితో కలిసి ఆయా వార్డుల్లో కలియతిరిగారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు ఉమాపతి, శ్రీకాంత్, నల్లప్ప, చరణ్, ప్రసాద్, మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులకు పట్టాలు ఇవ్వడమే లక్ష్యం

బొమ్మనహాళ్: అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని సర్పంచ్ శ్వేత, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటాక్షి పతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గోనేహాల్‌లో 52 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంపల్లి వెంకటస్వామి, వీఆర్‌ఓ సుజాత, వైస్ సర్పంచ్ సురేష్, నాయకులు రామకృష్ణ, కోటిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగభూషణ, బుడ్రా శ్రీరామ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ పే పేరుతో టోకరా

- కిరాణా షాపులో రూ.25వేల సిగరెట్ల కొనుగోలు
- ఇతరుల నంబర్‌కు ఫోన్ పే చేసి సరుకుతో పరారీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కిరాణా వ్యాపారి



సీసీ టీవీ పుటేజీల్లో షాపు యజమానిని మోసగిస్తున్న వ్యక్తి స్పష్టంగా కన్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పాతిక వేలు విలువ చేసే సిగరెట్లు కొని.. ఫోన్ పే చేస్తున్నట్లు నటించి కిరాణా వ్యాపారికి టోకరా వేసిన కేటుగాడి ఉదంతం ఉరవకొండలో శనివారం వెలుగుచూసింది. పట్టణంలోని బాలాజీ థియేటర్ వద్ద ఉన్న కిరణ్ జనరల్ స్టోర్‌కు శుక్రవారం ఓ అపరిచిత వ్యక్తి వచ్చాడు. తనకు హోల్‌సేల్ ధరకు సిగరెట్లు కావాలని అడిగితే షాపు యజమాని కిరణ్ సరే అని.. లిస్టు మేరకు బండిళ్లు ప్యాక్ చేశాడు. రూ.25వేలు బిల్లు అయ్యిందని తెలపగా.. ఫోన్ పే చేస్తానని నంబర్ తీసుకున్నాడు. ఫోన్‌లో ఆ నంబర్‌కు కాకుండా మరొకరి నంబర్‌కు నగదును బదిలీ చేసి 'సక్సెస్' అనే మెసేజ్‌ను మాత్రమే కిరాణా వ్యాపారికి చూపించాడు. ఆ తర్వాత సిగరెట్ల బండిళ్లతో అపరిచిత వ్యక్తి తుర్రుమన్నాడు. ఫోన్ పే చేసి చాలా సమయమైనా ఇంకా తనకు జమ అయినట్లు మెసేజీ రాకపోవడంతో అపరిచిత వ్యక్తి తనను మోసం చేశాడని కిరాణా వ్యాపారి గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు షాపు వద్ద సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి.. మోసగాడిని గుర్తించే పనిలో పడ్డారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలు

బొమ్మనహాళ్: గోవిందవాడలో ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ సభ్యులు ఖలందర్, మహమ్మద్, వన్నూరుస్వామి, సునీల్, కిరణ్, లింగారెడ్డి, వై.లోకేష్, నవీన్, నరసింహ, మోనేష్, సురేంద్ర తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

తాగునీటి శుద్ధి పక్కాగా ఉండాలి



కూడేరు: నీటిని శుద్ధి చేయటాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ నిధియా దేవి

కూడేరు: ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని జెడ్పీ సీఈఓ నిధియా దేవి సంబంధిత అధికారులకు ఆదేశించారు.శనివారం ఆమె కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌ను సందర్శించారు.ఫిల్టర్ బెడ్స్, ఇంటెక్‌వాల్, డ్రా వాటర్, నీటి శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రాజెక్ట్ ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీరు సరఫరావుతుంది. నీటి శుద్ధిని ఏవిధంగా చేస్తున్నారు. వృధా వాటర్‌ను బయటకు ఏవిధంగా పంపుతారని డీఈ శ్రీనివాసులుతో ఆరా తీశారు. 900 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈ వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్ట్‌లో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలియజేశారు. ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఈఈ లావణ్య, సూపర్ వైజర్లు లక్ష్మీరెడ్డి, మంజునాథ్ రెడ్డి , కార్మికులు కొండారెడ్డి, గంగాధర్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మూడు కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు 789 మందికి గాను 22 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 146 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు. జూనియర్ కళాశాలలో 338 మందికి గాను 8 మంది, మోడల్ కళాశాలలో 297 మందికి గాను 8 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు జ్ఞానేశ్వర్, వీరేష్, తోటా వెంకటేశులు తెలిపారు. పట్టణంలోని మూడు కేంద్రాల్లో డీఎస్పీ శ్రీనివాసులు భద్రత పర్యవేక్షించారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కిశోర్, వైద్యాధికారి మాధవి

రాయదుర్గంటౌన్ / కూడేరు/ బొమ్మనహాళ్/ఉరవకొండ/కంబదూరు/బెళుగుప్ప/ కణేకల్లు/ గుమ్మఘట్ట: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజం నిర్మిద్దామని మున్సిపల్ కమిషనర్ కిశోర్, ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మాధవి పిలుపునిచ్చారు. ఈనెల 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై శనివారం రాయదుర్గం, కూడేరు, బొమ్మనహాళ్, ఉరవకొండ, కంబదూరు, కణేకల్లు, బెళుగుప్ప, గుమ్మఘట్ట తదితర మండలాల్లో పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలు

బ్రహ్మసముద్రం : కళ్యాణదుర్గం నుంచి శనివారం బ్రహ్మసముద్రం వైపు వెళ్తున్న ఆటోను గొంచిరెడ్డిపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఆటో బోల్తాపడటంతో తొమ్మిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పరశురాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

కంబదూరు: తమకు పెళ్లి చేయరేమోనన్న బెంగతో ప్రేమికులు ఆత్మహత్యాయత్నం చేశారు. వీరిలో ప్రేమికుడు మృతి చెందాడు. ప్రేమికురాలు చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన హరిజన హరిభూషణం (26) అదే గ్రామానికి చెందిన త్రిష అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరూ గత నెల 28న పెళ్లి చేసుకుందామని ఇంటి నుంచి వెళ్లిపోయారు. కంబదూరు మండలం గుద్దెళ్ళ గ్రామంలోని హరిభూషణం మేనమామ ఇంటికి వెళ్లి పెళ్లి విషయమై చర్చించారు. ప్రేమికులిద్దరినీ పోలీసులకు స్టేషన్‌కు తీసుకెళ్లి పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఏమైందో ఏమో తెలియదు కాని శనివారం ఉదయం హరిభూషణం గుద్దెళ్ళ గ్రామ సమీపంలోని పొలంలోకి వెళ్లి కానిగ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. హరిభూషణం ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న త్రిష కూడా మామిడి కాయలకు స్ప్రే చేసే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు గమనించి త్రిషను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలి పారు. ఎస్ఐ అంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.